# ఎగిరిపోయిన చిలుక




పి.యస్.నారాయణ

"తాతయ్యా!"

"చెప్పమ్మా!"

"మరే.... తాతయ్యా!..."

"ఏమిటమ్మా!... నీకు యిరవయ్యేళ్ళు వచ్చినా చిన్నపిల్లవే. ఏం కావాలో చెప్పు!" ఆయన మురిపెంగా మనుమరాలి మొఖం లోకి చూస్తూ అన్నారు.

రాజ్యం కంట్లో నీరు సుళ్ళు తిరిగింది.

బోసిగా గాలితో గిరున తిరుగుతున్న పంజరం ఆమె గుండెల్ని పిండేస్తోంది.

"చిలక ఎగిరిపోయింది తాతయ్యా!"

"అరె!.. ఎందుకని?" ఆయన ఉలిక్కిపడి రాజ్యం మొఖంలోకి చూశారు.

పంజరంలో చిలక రాజ్యంకు ఆరో ప్రాణం!

రాజ్యం ఏడుపును ఆపుకోలేకపోయింది.

"ఎందుకనమ్మా!...ఎలా పోయింది?" జాలిగా రాజ్యం మొఖంలోకి చూస్తూ అన్నారు.

చిలక ఎగిరిపోవటం ఎలా వున్నా రాజ్యం బాధపడటం ఆయన సహించలేరు!

పంజరం పక్కగా, నేల మీద పడవేసి వున్న చేతికర్రను అందుకున్నారు వంగి.

రాజ్యం గొణుగుతున్నట్టుగా అన్నది: "పూర్ణచంద్రరావుగారు...కొడుకే వదిలేసినట్టున్నాడు!"

తను సీత ధ్యాసలోపడి చదవటం లేదని ఎప్పుడూ అరుస్తుంటాడు.

అందుకే అయి వుంటుంది!

"ఛ! మీ నాన్నా!...ఏదీ...వాడిని పిలు నేనడుగుతాను!"

"ఇంకెక్కడున్నాడు ఆయన!" కోపంగా బుంగమూతి పెట్టింది!

ఆయన నీరసించినట్టుగా వెనక్కు వాలారు.

గొంతు తగ్గించి అనునయిస్తున్నట్టుగా, "పోనీలే అమ్మా! మరో దాన్ని తెప్పిస్తాను. ఏడ్వబోకు!" అన్నారు. అని, "ఏమిటో దీనికి ఎలా చెప్పాలో అర్థం కావటంలేదు.. అలనాడు రామదాసు అంతటి వాడు చిలకను పెంచే జయిల్లో కూర్చున్నాడు.. వద్దమ్మా.. మనకు పనికిరాదమ్మా అంటే వినదు! అనుకున్నారు—అయినా పైకి అనలేదు.

ఆయన తత్వమే కాదు, అది!

రాజ్యం పెద్దగానే ఏడ్చేసింది: "ఉహూ.. నాకు నా సీతే కావాలి.. నాకు మరోటి అక్కర్లేదు.. అది నాకు దొరక్క పోయిందంటే నేను అన్నం తిననే తినను!" చేతు లూపుకుంటూ ఏడ్చేసింది.

ఆయనకి కోపమొచ్చింది కొడుకు చేష్టకి: "వాడిని రానీయ్.. దాన్ని తెచ్చిం దాకా ఇంట్లో కాలు పెట్టనీయను!"

—సరిగ్గా ఆ సమయంలోనే...

* * *

"నాకు భయంగా వున్నది చలపతీ!" అన్నాడు రామ్మూర్తి వాకిట్లో తలుపు పక్కగా నిల్చుని.

"నాకూ భయంగానే వున్నది రామ్మూర్తీ! కానీ ఏంచేద్దాం?" అన్నాడు చలపతి.

"చూస్తూ చూస్తూ ఈ వయస్సులో వున్న ఆయనకు ఆ విషయం చెప్పాలంటే నాకు నోరు రావటంలేదు!" అడుగు ముందుకూ వెనక్కూ పడుతున్నది.

"ఒక్కగా నొక్క కొడుకు.. రాగూడని కష్టమే ఆయనకు వచ్చింది.. ఈ విషాన్ని భరించటం దుర్భరమే!" చలపతికి నోరు పెగలటంలేదు.

"తలుపు తెరిచి చూడు.. వరండాలోనే పడుకున్నట్టున్నాడు ఆయన!"

తలుపు కిర్రుమన్నది.

"చంద్రమూ ఎంత పని చేశావయ్యా!" రామ్మూర్తి గొణుక్కున్నాడు.

సన్నగా విచ్చుకున్న తలుపు సందు లోంచి లోపలికి తొంగిచూశాడు చలపతి.

రాజ్యం ఏడుస్తూ కనబడింది.

ముసలాయన చేతిలో కర్రతో వంచి కాళ్ళ మీద మంచం మీద దిగులుగా కూర్చొని వున్నాడు.

"చంద్రానికి యాక్సిడెంట్ అయిన సంగతి గాని తెలియలేదు గదా వాళ్ళకు!" ఆశ్చర్యపోయాడు చలపతి.

"రాజ్యం ఎందుకో ఏడుస్తున్నది రామ్మూర్తీ!"

"తండ్రి సంగతి తెలిసిందేమో!" రామ్మూర్తి ఉలిక్కిపడ్డాడు. "ఆ ముసలాయనకు ఎలా చెబుతుందో.. అసలే హార్టు పేషెంటు!"


తలుపులు బార్లా తెరుచుకున్నాయి.

అనుకోకుండా ఆ సమయంలో వచ్చిన వాళ్ళిద్దరి వంకా ఆ ముసలాయన వింతగా చూశాడు.

పలకరిస్తున్నట్టుగా పెదాలు సన్నగా కదిలాయి.

యిబ్బందిగా ఆయన మొఖంలోకి చూడబోయారు యిద్దరూ!

వాళ్ళేగాదు ఎవరికైనా అలాగే వుంటుంది. అలాంటి క్షణాలలో—ఒక్కగా నొక్క కొడుకు— గంపెడు సంసారాన్ని ఒక్క చేతి మీదుగా నడుపుకు వస్తున్న ఒక్కకొడుకూ — నో యాక్సిడెంట్‌లో ఘోరంగా చిక్కుకుని కొద్ది గంటలే



అతనికి చివరి గంటల్లా చేసుకోగా—ఆయన తండ్రికి, అందునా హార్టు పేషెంటుకు ఆ విషయం తెలియబేయటం కష్టమే!

వాళ్ళిద్దరికీ ఏలా తెలియజేయాలో అర్థం కావటం లేదు!

నిజంగా, వాళ్ళకు పరీక్షా సమయం అది. కత్తి మీద నడుస్తున్నారు వాళ్ళు.

వాళ్ళ మాటల మీద— చంద్రం ప్రాణమెలా వున్నా— ఆ ముసలాయన ప్రాణం ఆధారపడి వున్నది!

హార్టు పేషెంటుకు ఆ వార్త విషం కాదనే నమ్మకమేమిటి?

"ఏమిటిలా వచ్చారు? చంద్రం బయటకు వెళ్లాడు!" అన్నారు ఆయన నవ్వి.

"లేదు.." నసిగాడు రామ్మూర్తి.

"యింట్లో లేడయ్యా బాబూ!.. నేను చెప్పింది అబద్ధమంటారా?" ఆయన కాస్త ముందుకు వంగారు నవ్వుతూనే...

"—అది గాదంటి!"

"ఏదిగాదు?" ఆయన నుదురు ముడి పడింది. ఎక్కడా ఆకు అల్లల్లాడటం లేదు. గుండెల్లోంచి చెమట బయటకు తన్నుకొస్తోంది!

గాలిబుడగ ఫట్‌మనేలా వున్నది.

"చూచారూ..!" చలపతి అందుకున్నాడు. "కష్టాలనేవి మానవు లందరికీ..."

—సరిగా ఆ సమయంలోనే...

* * *

ఆపరేషన్ థియేటర్ తలుపులు తెరుచుకున్నాయి.

ఎయిర్ కండిషన్డ్ హాల్లోకి వెలుగూ వెచ్చటి గాలి పోటీ బడుతూ చొచ్చుకొచ్చినయి.

డాక్టర్లు మాస్కులు విప్పేస్తున్నారు.

నర్స్ నాప్‌కిన్‌కు పెట్టుకున్న పిన్నును సరిచేసుకొని, ఇన్‌స్ట్రుమెంట్స్ ట్రాలీని పక్కకు తోసుకెళుతోంది.

మెడికల్ స్టూడెంట్స్ బిలబిలా—నవ్వుకుంటూ, ఏదో చెప్పుకుంటూ—బయటకు వెళ్లారు.

హౌస్ సర్జన్ తెల్లకోటులో బయటకు వచ్చాడు.

ప్రమాద పరిస్థితులలో వున్న రోగుల వివరాలు తెలియబరిచే బోర్డు దగ్గర నుండి డస్టర్‌తో— పూర్ణచంద్రరావు— అను పేరును చెరిపివేశాడు!

అది చూస్తున్న చంద్రం ముగ్గురి మిత్రుల గుండెలూ ఒక్కసారిగా విలవిలా కొట్టుకున్నయి.

"అంటే—?" ఒకతను ముందుకు వచ్చి హౌస్ సర్జన్ మొఖంలోకి జాలిగా చూచాడు.

"అంటే—" నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టుగా కనబడింది హౌస్‌సర్జన్ మొఖంలో.

"అదే.. పేరు చెరిపేశారు?" నోట మ్మట నీళ్ళు కార్చాడు అడిగినాయన.

"ఇంకా వుంచాలనా మీ ఉద్దేశ్యం?"

"క్షమించాలి!"


"పేషెంట్ అవుటాఫ్ డేంజర్!"

మిత్రులు ముగ్గురూ తేలిగ్గా నిట్టూర్పులు విడిచారు.

'అమ్మయ్య'

"పేషెంటుకు చావులేదు!" హౌస్‌సర్జన్ థియేటర్ లోపలికి వెళ్ళిపోయాడు.

## ఎగిరిపోయిన చిలక



—లోపల పూర్ణచంద్రరావు చచ్చినట్లు పడి వున్నాడు!

ముగ్గురిలో సుబ్రహ్మణ్యం, "అయితే వెంటనే వాళ్లింటికి వెళ్లి ఆ విషయం చెప్పాలి—అసలే వాళ్ళ నాన్న హార్టు పేషెంటు రామ్మూర్తి, చలపతి ఎలా చెప్పి ఏడ్చాడో!" అన్నాడు.

మిగతా ఇద్దరూ, "అవు నవును!" అన్నారు.

సుబ్రహ్మణ్యం బయటకు పరుగెత్తాడు.

—సరిగ్గా ఆ సమయంలోనే...

* *

గది లోపల సర్వం మరచి కూర్చున్న రాజ్యంకు బయట తాతయ్య— చలపతి రామ్మూర్తి—మాట్లాడుకుంటున్న మాటలే వినబడటం లేదు.

ఆమె మనసులంతా పంజరం చుట్టూ తిరుగుతోంది. పంజరంలో వుండే సీత చుట్టూ తిరుగుతోంది. సీతను వదిలేసి తనకు గాకుండా చేసిన తండ్రి చుట్టూ తిరుగుతోంది.

ఎందుకలా చేశాడాయన?

తనకు సీతంటే యిష్టమని తెలుసు. ఇష్టమని తెలిసీ అలా చేశాడంటే—

—ఊహూ....

అర్థం కావటం లేదు. రాగానే అడిగేయాలి.

ఎదురుగా వున్న ఖాళీ పంజరాన్ని చూస్తూంటే కడుపులో తిప్పుతున్నట్లనిపించింది.

సీతలేని పంజరం తనకెందుకు?

దానిని వదిలిన తన తండ్రే గాదు మరెవ్వరూ గూడా తిరిగి తీసుకువచ్చి తనకు ఇవ్వలేదు!

సీతలేని పంజరాన్ని తను చూడలేదు.

వద్దు.... అది ఇంకా తన కళ్ల ఎదుట వద్దు. గతాన్ని గుర్తుకు తెస్తూ తన గుండెల్ని ప్రతిక్షణం నలిపివేసే ఆ నిర్జీవమైన పంజరం ఆమెకు వద్దు.

వ్రేలాడుతున్న దాన్ని చేతిలోకి తీసుకుంది. కంట్లో నుండి నీరు చెంపల మీదుగా జారుతున్నది. హృదయం వేదనతోనూ, బాధతోనూ కుమిలిపోతున్నది.

తనకు సీత లేదు.

సీతలేని పంజరం తనకు వద్దు.

గట్టిగా—రెండు చేతుల మధ్యా పెట్టుకొని నొక్కివేసింది. బలమంతా వుపయోగించి నొక్కివేసింది. అందమైన పంజరం వికృతంగా మారేలా నొక్కివేసింది.

టేబుల్ కాలికి వేసి గట్టిగా బాదింది.

—వంకరలు తిరిగి, విరిగిపోయిన పంజరాన్ని కాలి క్రిందవేసి కసిగా తొక్కివేసింది

దిండులో తలదూర్చి వెక్కివెక్కి ఏడ్వసాగింది.

"ఇక నాకు సీత లేదు!"

—సరిగా ఆ సమయంలోనే...

* * *

"చంద్రానికి ఏక్సిడెంట్ అయింది!" రామ్మూర్తి గుండె బిగపట్టుకొని చెప్పాడు.

'ఎవరికీ—మా చంద్రానికా?'

"మీరు గాభరా పడవద్దు." చలపతి హడావుడిగా ముందుకు వచ్చాడు.

— ఆయన గుండెలమీద చేతులు వేసి రాయాలేవో?

—ఏమిటీ, 'మా చంద్రానికే?' ఆయన రెట్టించారు.

'అవును!' అన్నాడు తప్పు చేసిన వాడిలా తలవంచుకొని రామ్మూర్తి. మన చంద్రానికే .... మే మంతా వున్నాం... ...బజార్లో తలవంచుకు నడుస్తున్నాడు... ఎదురుగా లారీ వచ్చింది... చూడలేదు.... హడావుడిగా పక్కకు తప్పుకుంటే...... మోటర్ సైకిల్!

'ఇప్పు డెక్కడున్నాడు?" ఆయన నల్లటి పెదాలు అల్లల్లాడినయ్. ఆయన ముఖం నల్లబడింది. ఆయన మొఖం మీద పడ్డ ముడతలు నల్లటి తాళ్లతో ఆయన ముఖాన్ని ఇనుప పంజరంలో పెట్టి బిగించి వేయసాగినయి.

ఆయన వణికిపోతున్నారు.

చేతికర్ర సాయంతోలేచి నిలబడ్డారు.

గుండె దడదడ లాడుతున్నది బలహీనంగా. చలపతి, రామ్మూర్తి చెరోవేపు నిల్చు




"ఎక్కడున్నాడు వాడు?" కేకపెట్టారు.

"హాస్పిటల్‌లో!"

"బ్రతుకుతాడా?"

ఇద్దరూ మాట్లాడలేక పోయారు. కళ్ళు నీరుపట్టుకు పోయినాయి.

ఏం సమాధానం చెప్పాలి?

ఎలా సమాధానం చెప్పాలి?

పాలిపోయిన ముఖాలతో కన్నార్పకుండా ఆయన మొఖంలోకి చూడసాగారు.

అంతే— వాళ్ళనుకున్నంతా అయింది! జరుగుతుందనుకున్నఘోరం ఆపలేకపోయారా అనిపించింది.

— ముసలాయన తను అప్పటిదాకా కూర్చున్న మంచం మీదకు కుప్పలా కూలబడి పోయారు.

గుండెల మీద చేతులు వేసుకొని బాదుకోసాగారు.

"చంద్రా!"

దుఃఖం ఉండలు చుట్టుకు బయటకు తన్నుకొస్తోంది.

"చంద్రా!"

రామమూర్తికీ, చలపతికీ గూడా దుఃఖం ఆగలేదు.

"అనుకున్నంతా చేశావ్ భగవంతుడా! నే ననుకున్నంతా చేశావ్.... ఎదురుచూస్తున్న భయంకర క్షణం రానే వచ్చింది..... వాడికి ముప్పయి తొమ్మిదో ఏట గండం

# ఎగిరిపోయిన చిలక

వుందని నాకు తెలుసు.... కాని అది ఇంత ఘోరంగా నిజమవుతున్నదని నమ్మలేక పోయాను. ... ఈ గండం తప్పించమని నిన్ను ఎంతాగానో ప్రార్థించాను... నా మీద దయ చూపించలేక పోయావా?... ఈ గండం తప్పిందో వాడికి డెబ్బయి ఏళ్ళదాకా ఏ భయమూ వుండేది గాదు ... కానీ, నా మీద కనికరం లేకపోయింది. ... ఈ వయస్సులో నా చంద్రం లేకుండా నే నెలా జీవించేది... భగవంతుడా...."

ఆయన కంఠం రుద్ధమయింది.

"భగవంతుడా! నేనీ బాధ భరించలేను... నన్నూ వాడి దగ్గరకే తీసుకువెళ్ళు!"

పెద్దగా ఏడ్వసాగారు.

లోపల నుండి పూర్ణచంద్రరావు భార్య బయటకొచ్చింది.

రాజ్యం బయట కొచ్చింది.

పిల్లలంతా బయట కొచ్చారు.

ఏడుస్తున్న ముసలాయన్ని అంతా చుట్టు ముట్టారు.

"ఏమైంది? ఏమైంది?"

ముసలాయనకు వాళ్ళందరినీ చూస్తుంటే దుఃఖం మరింత అధికమయింది.

ఇక వీళ్ళందరికీ దిక్కు ఎవరు?

"— ఇంతమందినీ వదిలి వెళ్ళిపో తున్నావా, చంద్రా?"

ఏదో భయంకరమైన అరుపుతో పిడుగు పడ్డట్టనిపించగా పూర్ణచంద్ర రావు భార్య కుప్పలా కూలిపోయింది.

"ఆయన కేమైంది?... ఆయన కేమైంది, చెప్పరేం?"

"నాన్నా?" రాజ్యంకూ అర్థం కాలేదు. కాని తెలియని భూతమేదో తమ కుటుంబాన్ని చుట్టుకు పోతున్నట్టుగా అనిపించగా భయంతో బిగుసుకు పోతుంది.

"నాన్న కేమైంది?"

తిరిగి రామ్మూర్తి నోరు తెరిచాడు.

"చంద్రానికి ఏక్సిడెంటయింది ... హాస్పిటల్‌లో వున్నాడు... మనమంతా వెళ్దాం పదండి!"

— సరిగ్గా ఆ సమయంలోనే...

* * *

స్కూటర్ దిగిన సుబ్రహ్మణ్యం లోపల ఏడుపులు వింటూనే హడావుడిగా—స్కూటర్‌కు స్టాండు గూడా వేయకుండా — అక్కడే వదిలి లోపల కాలు పెట్టాడు.

మధ్యలో కుప్పగా కూలిపోయివున్న ముసలాయన, అటుపక్క ఏడుస్తూ నెత్తి కొట్టుకుంటున్న పూర్ణచంద్రరావు భార్య... ఏడుస్తున్న రాజ్యమూ.... పిల్లలూ— శిలల్లా నిలబడిపోయిన రామమూర్తీ, చలపతీ.

చూడగానే అర్థమయింది సుబ్రమణ్యానికి!

అర్థమయిన సుబ్రమణ్యానికి చెమటలు పట్టింది.

జాలివేసింది.

—ముసలాయన వాళ్ళు తెచ్చిన ఖబురు భరించలేక.....

ఆగలేక పోయాడు.


పరుగెడుతున్నట్టుగా వచ్చివాళ్ళ నడుమ వచ్చాడు.

"ఎవ్వరూ భయపడవద్దు... చంద్రానికి ఏ ప్రమాదమూ లేదు!.. కులాసాగా వున్నాడు!" వాళ్ళకు ఇంకా ధైర్యం చెప్పాలనే ఉద్దేశ్యంతో, హుషారుగా, "ఇంకా చెప్పాలంటే చంద్రం కొద్ది గంటల్లో ఇంటికొస్తున్నాడు!" అన్నాడు.

అందరూ ఒక్కసారి నోళ్ళు తెరుచుకొని సుబ్రమణ్యం మొఖంలోకి చూశారు.

"నిజం! నేను చెబుతున్నది నిజం!" ఉన్నట్టుగా నవ్వులు అతడి చూపులు.

రామమూర్తీ, చలపతీ ముందుకు వంగి



సంతోషంగా ఏదో అనబోయారు.

ముసలాయన ఒక్క ఉదుటున లేచి నిలబడ్డారు. ఆయన శరీరం సంతోషంతో తేలిపోతుంది. "అమ్మయ్య! ఇక డెబ్బయి ఏళ్లవరకు వాడికే ఢోకా లేదు .... వాడి కింకేం భయంలేదు ..... భగవంతుడా ! మమ్మల్ని కనికరించావయ్యా!... నమస్కార మయ్యా నాయినా!.... మా కోటి నమస్కారాలు అందుకో ..... కొన్ని నిముషాలు మమ్మల్ని, మా మనసుల్ని నలిపేస్తే నలిపేశావ్‌గాని.... మేం అంతా నీకు కృతజ్ఞులం.... హమ్మయ్య!" అన్నారు పెద్దగా నిట్టూర్పు విడుస్తూ.

ఆయన ఎంతగానో తేలికబడ్డారు.

గాలిలో తేలిపోతున్నంతగా తేలికబడ్డారు.

సంతోషమంటే అలా వుంటుందని ఆయనకు మొట్టమొదటి సారిగా తెలిసి నట్లనిపించింది.

"దేవుడా! నీకు జన్మ జన్మాలకు ఋణ పడి వుంటాం!"

— ఎంత హాయిగా వున్నది!

గుండెల్లో నరాలు ఫట్ మన్నట్లనిపించింది.

మరుక్షణంలోనే—

"అబ్బా" అంటూ గుండెను పట్టుకొని తను ఎప్పుడూ కూర్చుండే నులకమంచం మీదకు కూలబడిపోయారు.

రామ్మూర్తికీ, చలపతికీ, సుబ్రమణ్యానికీ అర్థం కాలేదు. ఆయన ఎందుకలా పడిపోయారు ...

"అబ్బా", అన్నారు మరోసారి మెలికలు తిరిగి పోసాగారు. మొఖం నల్లబడి పోయింది. నరాలు బిగుసుకు పోగా, ఆయన విరుచుకుంటుంటే "ఫట్, ఫట్" మనే శబ్దమవుతున్నాయి మొఖం పీక్కుపోతుంది కళ్లు ఉబ్బుకొస్తున్నాయి. కనుగుడ్లచుట్టు ఎర్రటి చారలు వల పన్నుతున్నాయి. పళ్లు కరకరలాడుతున్నాయి విలపిస్తున్నట్టుగా... చమటలు కక్కుతున్నవి శరీరం, తల!

"అబ్బా!" అన్నారు మరోసారి బిగుసుకు పోయి... ఉన్నట్లుండి గిలగిలా కొట్టుకోసాగారు...

వాళ్లకు ఆయన పరిస్థితి అర్థమయ్యేటప్పటికే— అంతా అయిపోయింది!

ఆయనలోని చిలక ఎగిరిపోయింది!

— సరిగా ఆ సమయంలోనే ....

* * *

దీనంగా, జాలిగా, భయంగా దిగులుగా— సంతోషంగా— ఎప్పుడూ పంజరం వ్రేలాడుతూ, వూగుతూ, గిరగిరా తిరుగుతూ వుండే స్థలాన్ని— రాజ్యం కన్నార్పకుండా చూసింది.

తెరుచుకున్న ఆమె నోరు అలాగే వుండిపోయింది.

— తాతయ్య పోయాడనే సంగతే ఆమెకు తెలియదు!

— తండ్రి ఆసుపత్రిలో గాయాలతో వున్నాడనే సంగతే మర్చిపోయింది.

— తన చుట్టూ దుఃఖం సముద్రంలో మునిగివున్న వ్యక్తుల సంగతే గుర్తు లేదు.

ఆమె సర్వం మరిచిపోయింది!

— ఆమె ఇంకా అలాగే, కన్నార్పకుండా పంజరం వుండవలసిన స్థలంలో 'చిక్‌చిక్' మంటూ తిరుగుతున్న తన సీతపంకే చూస్తోంది !

